



కలెక్టర్ ప్రావీణ్యతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, నిర్మల



కలెక్టర్, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి డంప్‌యార్డు ఆధునీకరణపై

కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో జగ్గారెడ్డి, నిర్మల సమీక్ష

రూ.18 కోట్ల హెచ్ఎండీఏ నిధులు మంజూరు చేయిస్తానన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో డంపింగ్‌యార్డు ఆధునీకరణ కోసం రూ. 18 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులతో శనివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపాలిటీ డంప్‌యార్డు సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు. చెత్తను సెగ్రిగేట్ చేయడానికి ఉన్న టెక్నాలజీ, డీపీఆర్ సిద్ధంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చెత్తను శుద్ధి చేసేందుకు హెవీ మిషనరీ అవసరం పడుతుందని జగ్గారెడ్డికి అధికారులు తెలిపారు. డంప్ యార్డులో చెత్తను శుద్ధి చేసేందుకు అవసరమైన నిధులు తెచ్చేందుకు తాను కృషి చేస్తానని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను జగ్గారెడ్డి కోరారు. సమీక్ష సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కోతులతో ముప్పు..

పెంకుటిళ్లకు రేకులకప్పు

చేర్యాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. పెంకుటిళ్లపై కూర్చుని గెంతుతూ, పైకప్పులను పాడు చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. తమ పెంకుటిళ్లను కాపాడుకునేందుకు కొందరు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. పెంకుల కప్పులపై రేకుల షీట్లు ఏర్పాటు చేయించుకుంటున్నారు. ఒక్కో అడుగుకు రూ.120 వరకు ఖర్చు అవుతున్నప్పటికీ, అటు వర్షం, ఇటు కోతుల నుంచి ఇంటికి రక్షణ లభించడంతో పాటు కొత్త లుక్ వస్తుందని భావిస్తున్నారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు స్పందించి కోతుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- చేర్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

అందించాలి

● కలెక్టర్ హైమావతి



డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కె. హైమావతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆమె సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, సెలవు కోసం దరఖాస్తు చేసుకోకుండానే విధులకు హాజరు కాని సీహెచ్‌వోపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డిప్యూటేషన్లు రద్దు చేయాలని, డాక్టర్లు తప్పనిసరిగా ఆసుపత్రిలో ఉండాలని డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడుతూ ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

యూరియా కావాలంటూ రైతులు రోడ్డెక్కుతూనే ఉన్నారు. సహకార సొసైటీలు, ఎరువుల దుకాణాల ఎదుట బారులు తీరుతూనే ఉన్నారు. గంటలు, రోజుల తరబడి ఎదురుచూసినా సరిపడా యూరియా బస్తాలు మాత్రం రైతులకు అందడం లేదు. గతానికి భిన్నంగా జిల్లాలో పరిస్థితి నెలకొంది. సిద్దిపేట జిల్లాకు రావాల్సిన కోటాను భారీగా తగ్గించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక్కడికి రావాల్సిన నిల్వలను దారి మళ్లిస్తున్నారా.. లేక కోటానే తగ్గించారా అనే విషయం తేలాల్సి ఉంది.

దారి మళ్లిందా..!

సిద్దిపేట జిల్లాకు భారీగా తగ్గిన యూరియా కేటాయింపు

- ఈ నెలలో 13,090 టన్నులకు 2,920 టన్నులే సరఫరా
- జూన్, జూలై నెలల్లోనూ ఇదే పరిస్థితి
- ఇతర జిల్లాలకు భిన్నంగా ఈ జిల్లా కోటా
- ఎక్కడికక్కడ రైతుల ఆందోళనలు
- తలలు పట్టుకుంటున్న వ్యవసాయాధికారులు



మిరుదొడ్డి మండలం అల్వాల్‌లో పట్టా పాస్‌బుక్కులను క్యూ లైన్‌లో ఉంచిన రైతులు

సిద్దిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : యూరియా కేటాయింపులో సిద్దిపేట జిల్లాపై చిన్నచూపు చూసినట్లుగా గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని 32 జిల్లాలతో పోల్చితే సిద్దిపేట జిల్లాకే యూరియా కోటా ఎక్కువ రావాల్సి ఉంది. ఆగస్టు నెలకు సంబంధించి కొన్ని జిల్లాలకు అవసరానికి మేర యూరియాను సరఫరా చేసినా, సిద్దిపేటకు మాత్రం కాదు. అత్యధికంగా సిద్దిపేట జిల్లాకే 9030 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. కానీ త్వరితగతిన సరఫరా చేయకుండా జాప్యం చేస్తున్నారు. మిగితా జిల్లాలకు 500 టన్నుల నుంచి 5వేల టన్నుల దాకా కోటా పంపించాల్సి ఉంది. అందుకే ఎక్కడా జరగనట్లుగా యూరియా కోసం ఆందోళనలు సిద్దిపేట జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. గత జూన్, జూలై మాసాల్లోనూ ఇదే స్థాయిలో యూరియా నిల్వలు కేటాయించారు. పాత నిల్వలు లేకపోవడం వల్లనే అధికారులు సైతం సర్దుబాటు చేయలేకపోతున్నారు.

వ్యవసాయాధికారుల పరేషాన్

యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతుండడంతో జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కేటాయింపులు జరగకుండా తాము ఎక్కడి నుంచి యూరియా బస్తాలు తెచ్చివ్వాలని తర్జనభర్జన పడుతున్నారు. పైగా రైతుల పాస్‌బుక్, పట్టా, పంట సాగుచేస్తున్నట్లు ధృవీకరణ పత్రాలు ఉంటే యూరియా బస్తాలు ఇవ్వాలనే నిబంధనలు పెట్టడం కూడా తలనొప్పిగా తయారైందని ఆవేదన చెందుతున్నారు. గతంలో వలే యూరియా కోటాను కేటాయిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోతున్నారు. యూరియా కావాలంటూ రైతులు తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తుండడంతో ఏఈవోల నుంచి జిల్లా అధికారుల దాకా ఇబ్బందులు పడుతున్నట్లుగా



రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి ఫర్టిలైజర్‌షాప్ వద్ద క్యూలో చెప్పులు ఉంచిన రైతులు

యూరియా వివరాలు (మెట్రిక్ టన్నులు)

నెల	అవసరం	కేటాయింపు
జూన్	4,230	3,534
జూలై	11,318	3,736
ఆగస్టు	13,090	2,920

మిగతా 8వ పేజీలో

యూరియా కొరతపై

హరీశ్‌రావు ఆగ్రహం



సిద్దిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట నియోజకవర్గంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యవసాయ అధికారులపై సీరియస్ అయ్యారు. శనివారం హైదరాబాద్ నుంచి ఫోన్ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సీజన్‌లో 11,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, కేవలం 4,772 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు యూరియా కోసం ఆధార్ కార్డులు, చెప్పులను క్యూలో పెట్టి ఎదురుచూస్తున్నారని, అయినప్పటికీ పూర్తిస్థాయిలో యూరియా అందక ఆందోళన చెందుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, ఆసక్తి ఉన్న రైతులను ఆయిల్ పామ్ కోత ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. పంట నష్టం, రైతు బీమాపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని ఆదేశించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి

● సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది నిజాయితీతో విధులు నిర్వహించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసులలో శిక్షల శాతం పెంచాలని, పరిశోధనలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, క్రైమ్ రేట్‌ను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. అనంతరం, జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీ రివార్డులు, నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకున్న పోలీస్ అధికారులతో సీపీ డాక్టర్ అనురాధ



హుస్నాబాద్ చౌరస్తాలో

మోడల్ ఆర్టీసీ బస్సు

హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దుకాణా సముదాయం వద్ద మోడల్ ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. 1952 నాటి ఆర్టీసీ బస్సు మోడల్‌ను హైదరాబాద్‌లో తయారు చేయించి గద్దెపై నిలిపారు. త్వరలో దీనిని ప్రారంభించనున్నారు. -హుస్నాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)

సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలి

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని, బతుకమ్మ పండుగ నాటికి పనుల్లో పురోగతి కనిపించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయాన్ని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. హుస్నాబాద్‌కు హరిత హోటల్‌ను తీసుకురావడంతో పాటు, ఎల్లమ్మ చెరువులో వాటర్ బోట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి పనులు పూర్తయిన తర్వాత అక్కడికి పీజీ కాలేజీ వస్తుందని చెప్పారు. ఎల్లమ్మ చెరువు నుంచి మల్లెచెట్టు చౌరస్తా వరకు డివైడర్‌తో కూడిన డబుల్ రోడ్డు పనులు చేపడతామన్నారు. పట్టణంలోని జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు కట్టపై మంత్రి పొన్నం ప్రభాకర్

సకాలంలో యూరియా తెప్పించాలి..

రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో యూరియా తెప్పించాలని సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ కలెక్టర్లను ఫోన్‌లో మంత్రి ఆదేశించారు. మండలాల వారీగా ప్రతీరోజు యూరియా పంపిణీపై రిపోర్ట్ అందజేయాలని ఆదేశించారు.

తిమ్మాపూర్‌లో డెంగ్యూ కలకలం

మూడు రోజుల క్రితం ఒకరు.. శనివారం మరొకరు మృతి

- కోలుకున్న మరో ఇద్దరు
- మంచంపట్టిన 50 మంది
- భయాందోళనలో గ్రామస్థులు





డెంగ్యూతో మృతిచెందిన శ్రావణ్, మహేష్ (ఫైల్)

జగదేవ్‌పూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలు పడగలో జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామం విలవిలలాడుతోంది. మూడురోజుల క్రితం ఓ యువకుడు డెంగ్యూతో మృతిచెందగా తాజాగా శనివారం మరొకరిని పొట్టనపెట్టుకున్నది. గ్రామానికి చెందిన నాయిని శ్రావణ్(17) వారం రోజుల క్రితం జ్వరం రావడంతో గ్రామంలోని ఓ ప్రైవేట్ క్లీనిక్‌లో చికిత్స చేయించారు. శుక్రవారం గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌కి తరలించారు. అక్కడి వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూగా నిర్ధారించగా, హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శ్రావణ్ శనివారం సాయంత్రం మృతి చెందాడు. గురువారం గ్రామానికి చెందిన మహేష్(32) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో డెంగ్యూ లక్షణాలతో మృత్యువాత పడ్డాడు. రెండు రోజుల వ్యవధిలో డెంగ్యూ లక్షణాలతో ఇద్దరు మృతిచెందడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఇటీవల

మిగతా 8వ పేజీలో

మళ్లీ చిరుత భయం

అల్మాస్‌పూర్, కొండాపూర్ పరిసరాల్లో సంచారం



చిరుత పాద ముద్రలు

దౌల్తాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నెల రోజుల క్రితం దొమ్మాట, గాజులపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో కలకలం సృష్టించిన చిరుతపులి మళ్లీ ప్రత్యక్షమైంది. శనివారం అల్మాస్‌పూర్, కొండాపూర్ శివార్లలో చిరుత సంచరించిందని గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో మిరుదొడ్డి సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, బీట్ ఆఫీసర్ మధులత చిరుత తిరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, దాని పాదముద్రలను గుర్తించారు. అవి చిరుత అడుగులేనని నిర్ధారించారు. చిరుత దొమ్మాట అడవిలోనే ఉందని, ప్రజలు ఒంటరిగా వెళ్లవద్దని, ఉదయం పొలాలకు వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లి చేతిలో కర్ర పట్టుకోవాలని అధికారులు సూచించారు. పశువులను పొలాల వద్ద ఉంచకుండా ఇళ్ల వద్దకు తెచ్చుకోవాలని, గొర్రెలు, మేకలు మేపడానికి అడవిలోకి వెళ్లవద్దని తెలిపారు. చిరుత జాడ తెలుసుకోవడానికి అడవిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. నెల రోజులుగా ఊపిరి పీల్చుకున్న గ్రామస్థులు మళ్లీ చిరుత సంచారంతో భయపడుతున్నారు.

కదులుతున్న రైలు ఎక్కబోయి...
జారిపడి రైల్వే మాజీ ఉద్యోగి మృతి


తాడేపు కిష్టయ్య (ఫైల్)

● మనోహరాబాద్‌లో విషాదకర ఘటన

మనోహరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోయి జారిపడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ రైల్వే స్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ సాదు లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్‌కు చెందిన తాడేపు కిష్టయ్య (71) బోధన్ నుంచి కాజీపేట వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. రైలు చక్రాల కింద పడటంతో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. వెంటనే స్థానికులు అతడిని మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. కిష్టయ్య గతంలో రైల్వే పైలట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పదవీ విరమణ తర్వాత మల్కాజిగిరిలో నివాసం ఉంటున్నారు. శనివారం తన సొంత గ్రామం మనోహరాబాద్‌కు వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ విషాదం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. యువకుడి మృతి

● తల్లి పరిస్థితి విషమం.. హుస్నాబాద్‌లో ఘటన
● బాధితులకు న్యాయం చేయాలని రాస్తారోకో

హుస్నాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని బస్ డిపో రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, అతని తల్లి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన బూడిద అజయ్(28) తన తల్లి పద్మతో కలిసి స్కూటీపై పాల కేంద్రానికి వెళ్తుండగా, ఆరపల్లికి చెందిన నమిలికొండ రామకృష్ణ అనే యువకుడు అతి వేగంగా బైక్‌పై వచ్చి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అజయ్‌కు తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పద్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన అజయ్‌కి భార్య సౌమ్య, 9 నెలల కుమారుడు ఉన్నారు. కాగా, నిందితుడు మద్యం సేవించి బైక్ నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబసభ్యులు, వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రాస్తారోకో చేశారు. సుమారు గంటసేపు ఆందోళన కొనసాగగా, పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అజయ్ భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అజయ్ (ఫైల్)

లారీ టైరు తలపైకెక్కి రైతు దుర్మరణం

● కొండాపూర్‌లో విషాద ఘటన.. బంధువుల ఆందోళన

కొండాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఒక రైతును మైనింగ్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గాజులగూడకు చెందిన రైతు కొత్త గొల్ల రాములు (58) శనివారం కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని తన పొలంలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో గాజులగూడ వైపు నుంచి అజాగ్రత్తగా వచ్చిన మైనింగ్ లారీ అతడి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాములు తల మీద నుంచి లారీ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా మైనింగ్ ప్రాంతానికి పారిపోయాడు. ఈ ఘటనతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. మైనింగ్ లారీల వల్ల తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆరోపించారు. సమాచారం అందుకున్న సీఐ సుమన్, ఎస్‌ఐ సోమేశ్వరి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు ఆర్థిక సహాయం చేస్తామని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


కొత్తగొల్ల రాములు(ఫైల్)

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

బెజ్జంకి మండలం తోటపల్లిలో మహిళ, హవేళిఘణపూర్ మండలంలో సర్దనలో వ్యక్తి, నిజాంపేట మండలంలో మరో మహిళ ఆత్మహత్య చేసుకున్నారు.

బెజ్జంకి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రేవోదు లక్ష్మీ (55) పురుగుల మందు తాగి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బెజ్జంకి మండలం తోటపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గతంలోనే భర్త మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తున్న లక్ష్మీకి ఇటీవల అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలి కూతురు వాసవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు మరణాన్ని తట్టుకోలేక తండ్రి..

హవేళిఘణపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కూతురి మరణాన్ని తట్టుకోలేక, మద్యానికి బానిసైన ఒక తండ్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సర్దన గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పిల్లి కృష్ణ (40) అనే రైతు సంవత్సరం క్రితం తన కూతురు వెంకటలక్ష్మి అనారోగ్యంతో మరణించడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై, శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సర్దనలో మనస్తాపంతో మహిళ..

నిజాంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భర్త దూరంగా ఉండటం, అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపానికి గురైన ఓగుల రాజవ్వ (55) అనే మహిళ నిజాంపేటలో శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న కుమారుడు ఇంటికి వచ్చేసరికి ఈ విషయం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి
నీట మునిగి వ్యక్తి మృతి


వద్ది రమేష్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన ఒక వ్యక్తి వలలో చిక్కుకుని నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని మహమ్మద్‌నగర్‌లో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వద్ది రమేష్ (44) సాయంత్రం గ్రామంలోని అవుసులవాని కుంటలోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడానికి వెళ్లగా, గట్టుపై అతని బట్టలు కనిపించాయి. ఈతగాళ్ల సహాయంతో గాలించగా, రమేష్ కాళ్లకు చేపల వల చుట్టుకుని ఉండటంతో నీట మునిగి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నర్సాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం... నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌లో విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న నర్సింలు (39) ఈ నెల 14న ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలైన అతడిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

కొండపాక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణా చేస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన రాకేష్, దుద్దెడకు చెందిన అమీర్, ఆకాష్, నర్సింలు అనే నలుగురు యువకులు గంజాయి తాగుతూ, సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం రావడంతో దుద్దెడ గ్రామం శివారులోని రైల్వే ట్రాక్ వద్ద త్రీ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన వారిని పట్టుకుని తనిఖీ చేయగా, వారి వద్ద 254.9 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.400 నగదు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంజాయికి అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.6,370 ఉంటుందని, నిందితులను రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు.

కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఇద్దరు..

మునిపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మునిపల్లి పోలీసులు కంకోల్ టోల్ ప్లాజా వద్ద శనివారం పట్టుకున్నారు. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్ నాయక్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేస్తుండగా, ఓ స్కూటీపై అనుమానం వచ్చి ఆపి విచారించారు. హైదరాబాద్‌కు చెందిన మందుగుల మారుతి, కల్వకుర్తికి చెందిన మందుగుల అఖిల తేజ కర్ణాటకలోని బీదర్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి, ఒక స్కూటీ, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్‌ఐ రాజేష్ నాయక్, సిబ్బందిని కొండాపూర్ సీఐ సుమన్ కుమార్ అభినందించారు.



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఏడుపాయలలో తగ్గిన వరద ఉధృతి

పాపన్నపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులుగా మంజీర నీటిలో మునిగిన దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం వరద ఉధృతి తగ్గింది. దీంతో ఆలయ బ్రిడ్జి తేలింది. వరుసగా మంజీర ప్రవాహం కొనసాగుతుండటంతో ఆలయ ప్రాంగణం గడ్డి, నాచుతో నిండిపోయింది. దీంతో అమ్మవారి ఆలయ పరిసరాలను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ఈ నెల 14నుంచి సింగూరు నీటిని విడుదల చేయడంతో దుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలో కొనసాగింది. అప్పటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు రాజగోపురం లో ఉంచి పూజలు చేస్తూ, భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఆదివారం వరద పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ సతీష్ తెలిపారు.



వనదుర్గమ్మ ఆలయం వద్ద తగ్గిన వరద

విహారయాత్ర, దైవదర్శనానికి ఆర్టీసీ ప్యాకేజీలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం, విహారయాత్రల కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలు తీసుకొచ్చిందని సంగారెడ్డి డిపోమేనేజర్ ఉపేందర్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని మహోరాగఢ్‌లోని రేణుకామాత ఏకవీర శక్తి పీఠం దేవాలయానికి ఈ నెల 30న రాత్రి 8 గంటలకు సంగారెడ్డి నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి, ఆదిలాబాద్ జిల్లాలోని పోచార్ వాటర్ ఫాల్స్ సందర్శించి తిరిగి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు సంగారెడ్డికి చేరుకుంకుంటుంది. రెండో విహారయాత్ర టూర్ ప్యాకేజీలో భాగంగా ఈ నెల 31న ఉదయం 5 గంటలకు సంగారెడ్డి నుంచి బయలుదేరి నాగార్జునసాగర్ డ్యాం సందర్శన, అనంతరం వైజాగ్ కాలనీ బ్యాక్ వాటర్‌లో బోటింగ్‌ను సందర్శించి తిరిగి రాత్రి 10 గంటలకు సంగారెడ్డికి చేరుకుంటుందన్నారు. చార్జీలు తదితర వివరాలకు 93986 90602, 73828 31275, 99592 26267 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీరామ్ రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపు లేకపోవడంతో రైతులకు ఒక్క బస్తా యూరియా దొరకడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా యూరియా అందించడంలో విఫలమైందని దుయ్యబట్టారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు సగం మందికే రుణమాఫీ చేయడం, వర్షాకాలం యాసంగికి సన్నవడ్లకు బోనస్ కూడా చెల్లించలేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి, రాష్ట్ర సలహాదారుడు రామ్‌చందర్ రావు, జిల్లా సలహాదారుడు గాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు



సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లోపే నెరవేర్చాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, స్వాతంత్ర సమరయోధులు వంగ గాలిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు మిట్టపల్లి స్వరూపరాణి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమ నాటి కేసులు ఎత్తివేయాలని, ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారి కుటుంబాలకు హెల్త్‌కార్డులు, ప్రభుత్వ పథకాలలో మొదటి ప్రాధన్యత ఇవ్వాలని అన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో రెండు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో చెన్నోజు సుదర్శన్, వాసంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లె భారతి, కావేరి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై విచారణ

నారాయణఖేడ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో కొనసాగుతున్న పెద్ద శంకరంపేట మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో గురుకులాల రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి తిరుపతి శుక్రవారం రాత్రి విచారణ జరిపారు. ప్రిన్సిపాల్ అక్రమాలు, విద్యార్థులకు అనారోగ్యాలు, నాణ్యతలేని భోజనం తదితర అంశాలపై పత్రికల్లో కథనాలు రావడంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ గురుకులాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి విచారణ జరిపారు. అయితే.. పిన్సిపల్, పీఈటీ, మరో ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటీ కార్యదర్శికి తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు కొందరు విద్యార్థులతో ప్రిన్సిపాల్ మంచివాడని కితాబు ఇప్పించినట్లు సమాచారం. డిప్యూటీ సెక్రటరీ బహిరంగంగా విద్యార్థులను ప్రశ్నించడంతో వారు ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నోరుమెదపలేదని తెలుస్తోంది. విచారణ అధికారి కూడా అంతా బాగుందని, విచారణ ముగించి రాత్రి ప్రిన్సిపాల్‌ను పాఠశాల నుంచి తన కారులో తీసుకెళ్లారు. దీంతో విచారణ మమ అనిపించారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

వయ్యారిభామతో ఆరోగ్య సమస్యలు



కొండపాక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వయ్యారిభామ మొక్కలతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, వాటిని నిర్మూలించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు విజ్ఞానవేదిక శాస్త్రవేత్త పల్లవి పేర్కొన్నారు. శనివారం కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో వయ్యారిభామ నిర్మూలనపై సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త పల్లవి మాట్లాడుతూ వయ్యారిభామ పుప్పొడి వల్ల మనుషులకు, పశువులకు దగ్గుదమ్ము వస్తుందని, ఒంటిపై దురద, దద్దుర్లు ఏర్పడతాయన్నారు. విషజ్వరాలు వ్యాపింపజేస్తుందన్నారు. ఈ మొక్కను పంటపొలాల్లో గమనించినట్లయితే పూతదశకు రాకముందు వేర్లతో సహా తీసివేసి ఒక గుంతలో వేసి మట్టి కప్పి నాలుగైదు మాసాల్లో సేంద్రియ ఎరువుగా చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ తీసి, పొలం గట్లపై వయ్యారిభామ మొక్కలను తీసి వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు

గజ్వేల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యుడిని బెదిరించిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ఇద్దరు వీడియో తీసి, ఈ విషయం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తానని వైద్యుడు నాగమునెయ్యను బెదిరించడంతోపాటు అతని ఆస్పత్రికి పేరును ఉపయోగించి, బయట వ్యక్తులను పెట్టుకుని వీడియో తీసి, మరో వ్యక్తి ద్వారా బెదిరింపులకు పాల్పడిన నిరంజన్, మరో వ్యక్తిపై వైద్యుడు నాగమునెయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

టెక్ విలేజ్ @ సంగుపేట

ఇంటింటికీ ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఫోన్ సేవలు

రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా గ్రామం

జోగిపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగుపేట గ్రామం టెక్‌విలేజ్‌గా మారింది. టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు, టెలిఫోన్, కేబుల్ టీవీ సదుపాయాలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌తో కలిసి టీ-ఫైబర్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్‌తోపాటు సంగారెడ్డి జిల్లాలోని సంగుపేటలను ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా గత డిసెంబర్ 8న పనులను ప్రారంభించారు. బీఎస్ఎన్ఎల్, ఏసీఎస్ టెక్నాలజీ అనే ప్రైవేట్ సంస్థ, స్మార్ట్ ప్లే అనే ఎంఎస్‌వో సహకారంతో ఇంటింటికీ ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఫోన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

గ్రామంలో 386 ఆవాసాలు ఉండగా, ఇందులో వలస వెళ్లిన వారిని పక్కన పెడితే 310 ఇండ్లు మాత్రమే లెక్కకు వచ్చాయి. ఆయా ఇళ్లకు ఇంటర్నెట్, ఫోన్ సదుపాయం, కేబుల్ టీవీ సదుపాయం కల్పించేందుకు అవసరమైన పనులు పూర్తి చేశారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొదటి కనెక్షన్‌ను బిగించారు. ట్రయల్‌రన్ జరిపి, సిగ్నళ్ల బలం, టీవీ ప్రసారాల నాణ్యత, ఇతర ఇబ్బందులను పరిశీలించారు. తర్వాత ప్రతీ ఇంటికి కేబుళ్లు వేసి ఇంటర్నెట్, ఫోన్, టీవీ ప్రసారాల కనెక్షన్లు ఇచ్చారు. ఇవన్నీ పూర్తయ్యేసరికి దాదాపుగా 5 నెలలు పట్టింది.



నిర్వహణ కోసం వాట్సాప్ గ్రూప్

ఇంటింటికీ ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వడం ఒక భాగమైతే.. దాని నిర్వహణకు వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్‌లో రోజూ సిగ్నళ్లను పరిశీలించడం. కోతుల బెడదతో కేబుల్ వైర్ తెగిపోవడం లాంటి సమస్యలు అధిగమించడం, ఆయా ఇళ్లల్లోని నిరక్షరాస్యులైన వినియోగదారుల ఇండ్లలో టీవీ ప్రసారాలు, ఇంటర్నెట్ కనెక్షన్ విషయంలో తలెత్తే సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారం చూపుతారు. ఇందులో బీఎస్ఎన్ఎల్ తరఫున ఒకరు, ఏసీఎస్ టెక్నాలజీస్ తరపున ఒకరు గ్రూప్ అడ్మిన్‌లుగా ఉంటారు. వినియోగదారుడు తమ ఇంట్లోని టెక్నికల్ సమస్యలను ఈగ్రూప్‌లో తెలియజేస్తే చాలు.. నేరుగా సదరు ఉద్యోగి ఆ ఇంటికి వెళ్ళి సమస్యను పరిష్కరిస్తున్నారు.

ప్రభుత్వ సంస్థలకు ఉచితమే

గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు ఉచితంగానే ఇంటర్నెట్ సేవలను అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో గ్రామ పరిధిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్, గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, రైతు సేవా కేంద్రం (రైతు వేదిక)కు ఉచితంగానే ఇంటర్నెట్ కనెక్షన్లనిచ్చారు. ఇక, వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ (వీడీఐ) పేరిట...వీడియో కాన్ఫరెన్స్‌ల కోసం ఉపయోగపడేలా ఆయా కార్యాలయాలకు కీబోర్డ్, స్క్రీన్ (మానిటర్), ల్యాండ్ లైన్ ఫోన్ (పరికరం) లను కూడా ఉచితంగానే అందిస్తున్నారు.

మూడు నెలలు ఉచితం

ఈ పథకం కింద ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకున్న నాటి నుంచీ తొలి మూడు నెలలు ఉచితంగా సేవలు అందించనున్నారు. వాస్తవానికి గ్రామంలో ఇంటింటికీ కనెక్షన్ ఇవ్వడం మే నాటికే పూర్తయ్యింది. జూన్ మొదటి వారం నుంచీ ఇంటర్నెట్, టీవీ ఛానెళ్ల ప్రసారం పూర్తి స్థాయిలో అందడం మొదలైంది. గ్రామస్థుల కోరిక మేరకు జూన్ నెలను మినహాయించి, జూలై మొదటి తారీఖు నుంచి మూడు నెలలపాటు ఉచితంగా ఇంటర్నెట్, ఫోన్, టీవీ ప్రసారాల సేవలు అందిస్తామని సీజీఎం ఇటీవల గ్రామస్థులతో సమావేశమై హామీనిచ్చారు. దీంతో జూలై నుంచి మూడు నెలల పాటు ఫ్రీగా ఈసేవలు అందనున్నాయి. నాలుగవ నెలనుంచీ ప్రతీ నెలా కేవలం రూ. 300కే ఈసేవలు లభ్యం కానున్నాయి. ఈపథకంలో భాగంగా, ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న ప్రతీ టీవీకి 350 ఫ్రీ ఛానెళ్లు, డిస్కవరీ, నేషనల్ జియోగ్రాఫిక్, ట్రావెల్ లాంటి 40 పే ఛానెళ్లనూ, ఇతర మూవీ ఛానెళ్లను ఉచితంగానే అందిస్తున్నారు. 15 ఫోక్ చానెళ్లను, సినిమాలను ప్రసారం చేసే మరి కొన్ని ఛానెళ్లను కూడా ఇస్తున్నాయి. లైవ్ టీవీతోపాటు జర్నలిస్ట్ డైరీ యాప్ ద్వారా రాష్ట్రంలోని ప్రధాన వార్తాపత్రికలను కూడా టీవీల్లో చదవొచ్చు. యూట్యూబ్‌ను కూడా అందజేస్తున్నారు. గ్రామస్థుల కోరిక మేరకు గత ఐపీఎల్ క్రికెట్ మ్యాచులను కూడా ఉచితంగానే అందజేయడం విశేషం.

అందరి సహకారంతో..



టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ పథకంలో భాగమవ్వడం గర్వంగా ఉంది. ఈసేవల వల్ల గ్రామమే పూర్తిగా డిజిటలైజ్ అవుతుందనడంలో సందేహం లేదు. గ్రామ కార్యదర్శి, గ్రామ ముఖ్యులు అందించిన సహకారం మరువలేనిది. ఏసీఎస్ టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యం, స్థానిక బీఎస్ఎన్ఎల్ సర్వీస్ ప్రొవైడర్ ప్రవీణ్‌ల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

- రాకేశ్, బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్

డిష్ కంటే చౌక..



గతంలో టీవీల్లో సినిమాలు, సీరియళ్లు చూడాలనుకుంటే డిష్ టీవీ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చేది. దీనికి ప్రతీ నెలా రూ.600 నుంచి రూ.700 చెల్లించాల్సి వచ్చేది. టీ ఫైబర్‌లో మా ఇంటికి కనెక్షన్ తీసుకున్నా. నెలకు కేవలం రూ.300తో.. ఇంటర్నెట్ కనెక్షన్‌తోపాటు, ఫోన్, టీవీ ఛానెళ్ల ద్వారా సీరియళ్లు, సినిమాలు కూడా చూడగలుగుతున్నాం.

-వెంకటలక్ష్మి, వినియోగదారు



అల్వాలలో యూరియా కోసం పాస్‌బుక్‌లు క్యూలో పెట్టిన రైతులు



హవేళీఘనపూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం ఆగని ఆందోళనలు

మిరుదొడ్డి/రాయపోల్/ హవేళిఘనపూర్/పెద్దశంకరంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళనలు ఆగడం లేదు. ఉదయం నుంచే గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వస్తోండంతో రైతులు సహనం కోల్పోతున్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామ రైతువేదిక వద్దకు యూరియా వచ్చిందని తెలియడంతో శనివారం రైతులు భారీగా వచ్చారు. అక్కడికి వచ్చిన వ్యవసాయాధికారులను అడ్డుకుని, రైతు వేదికలో నిర్బంధించారు. అంతకుముందు క్యూలో పాస్‌బుక్‌, ఖాళీ మద్యం సీసా పెట్టారు. రాష్ట్రంలో యూరియా దొరకడం లేదని, మద్యం ఏరులైపారుతోందని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు యూరియా దొరడం లేదన్నారు. యూరియా విషయంలో ఎంపీ రఘునందన్ యూరియా కొరత లేదనడం సరైంది కాదన్నారు. రైతులు యూరియా కోసం చెప్పులు అరిగేలా తిరిగిన కూడా యూరియా దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. ఎస్సై సమత తన సిబ్బందితో కలిసి వచ్చి, రైతులతో మాట్లాడారు. ఈ క్రమంలో పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు. నిర్బంధంలో ఉన్న అధికారులను పోలీసులు బయటకు తీసుకువచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. రైతుల ఆందోళనకు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాజులు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు హైమద్, బీఆర్ఎస్ నాయకులు బాపురెడ్డి, సత్యనారాయణ, మాజీ సర్పంచులు మద్దతు తెలిపారు. రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి ఫర్టిలైజర్ షాప్‌కు శనివారం 570 బస్తాల యూరియా వచ్చింది. దీంతో వందలాది రైతులు వచ్చి క్యూ కట్టారు. గంటల తరబడి నిలబడలేక చెప్పులను క్యూలో పెట్టారు. తొగుట సీఐ లతీఫ్, బేగంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. మెదక్ జిల్లా హవేళిఘణపూర్‌లో పది రోజుల నుంచి రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. శనివారం యూరియా రావడంతో భారీగా క్యూ కట్టారు. అధికారులు టోకెన్లు జారీ చేసి, ఒకొక్కరికీ రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. పెద్దశంకరంపేటలోనూ యూరియా కోసం ఫర్టిలైజర్ దుకాణాల వద్ద రైతులు బారులు దీరారు. పోలీసులు వచ్చి, క్రమపద్ధతిలో రైతులకు యూరియా అందేలా చేశారు.



పెద్దశంకరంపేటలో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

స్వాతంత్ర్య సమరయోధుడి కన్నుమూత



ఈశ్వరయ్య(ఫైల్)

అల్లాదుర్గం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మజ్జిగ ఈశ్వరయ్య (96) శనివారం సాయంత్రం కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రులు చికిత్స చేయించారు. అక్కడే ఆయన కన్నుమూశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడిగా ఈ ప్రాంతంలో ఈశ్వరయ్య గుర్తింపు తెచ్చుకున్నారు. ఈశ్వరయ్యకు భార్య మల్లమ్మ, కుమారులు మల్లికార్జున్, వీరేందర్ ఉన్నారు. ఆయన మరణవార్త తెలిసి మండలంలోని పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

బీవీఆర్ఐటీలో సాంకేతిక సింపోజియం

నర్సాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీ కాలేజీలో శనివారం సాంకేతిక సింపోజియం ఐడియా పిచ్చింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన పలు కాలేజీల నుంచి సుమారు 56 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లూసెస్ ఇన్నోవేషన్ సీఈవో వీఎస్‌కే మూర్తి హాజరయ్యారు. బీహెచ్‌ఈఎల్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ కన్నన్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ హెచ్‌వోడీ రాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.



ఉమ్మాపూర్ గుట్టల్లో కాలభైరవుడికి పూజలు

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మాపూర్ గుట్టలలో కొలువుదీరి ఉన్న శ్రీ చండీ సమేత కాలభైరవునికి శనివారం భక్తులు హోమం, పూజలు చేశారు. పురాతన విగ్రహం వద్దకు వచ్చిన భక్తులు భక్తితో పూజలు చేశారు. చండీ సమేత కాలభైరవుడికి పూజలు చేయడం వల్ల ఈ ప్రాంతంలో పాడిపంటలు సమృద్ధిగా పండి, సుఖసంతోషాలతో జీవిస్తారని భక్తుల నమ్మకం.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

ఎంపీ రఘునందన్‌రావు

వర్గల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి గొప్ప ఆశయంతో ముందుకు సాగుతూ మంచి పౌరులుగా ఎదగాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. శనివారం వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవానికి డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి, అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యాలయంలో ఎంత మంది శాస్త్రవేత్తలు అవుతారంటూ ప్రశ్నించారు.



పట్టుదల ఉంటే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదన్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో దేశం ఎంతో ప్రగతిని సాధించిందన్నారు. భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనలో శాస్త్రవేత్తలకు సహాయ పడుతున్నందను ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్, అధ్యాపక బృందం, విద్యార్థులు, బీజేపీ మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళాతో బోధన సులభతరం

● రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



భూంపల్లిలో టీఎఫ్ఎం మేళాను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీఎల్ఎం, ఎఫ్ఎల్ఎం మేళాతో విద్యార్థులకు సులభతరమైన విద్యాబోధన చేయడం జరుగుతుందని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళాను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధన సామగ్రి ఉపయోగించడం ద్వారా అర్థమయ్యే విధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు తీసుకుని వచ్చిన బోధన సామగ్రిని పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ అంజయ్య, కాంప్లెక్స్ హెచ్ఎంలు రాజేందర్, బాలకిషన్,మాజీ ఎంపీటీసీ ఉమారాణి బాలాగౌడ్, నాయకులు సురేష్, రంజిత్, అనిల్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన ఎజెండా

సిద్దిపేట రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రధాన ఎజెండాతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. ప్రజా సమస్యల నిమిత్తం ప్రజల వద్దకే అనే కార్యక్రమంతో శనివారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే గ్రామన్ని సందర్శించమన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ గుర్రాలగొంది గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతా

● ఏటిగడ్డ కిష్టాపూర్ మాజీ సర్పంచ్ డి. ప్రతాప్‌రెడ్డి


హరీశ్‌రావును కలిసిన మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఆయన శనివారం బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి హైదరాబాద్‌లోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని, బీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానని ప్రకటించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంఛార్జీ వంటేరు ప్రతాప్‌రెడ్డిల సారథ్యంలో కొనసాగుతానని, పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు.

గీత కార్మికులకు సేఫ్టీకిట్లపై అవగాహన


చేర్యాలలో గీతకార్మికులకు సేఫ్టీకిట్లను అందజేసి అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చేర్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కాటమయ్య సేఫ్టీకిట్ల వినియోగంపై చేర్యాల ఎక్సైజ్ అధికారులు శనివారం గీత కార్మికులకు శిక్షణ అందించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ సురేశ్, ఎస్సై సువర్ణ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కో-ఆర్డినేటర్ బాల్నె వెంకటమల్లయ్య, సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ బండకింది అరుణ్ ఆయా గ్రామాలకు చెందిన 80మందికి శిక్షణ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ సేఫ్టీకిట్లుపొందిన గీతకార్మికులు విధిగా వినియోగించాలని, నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. కార్యక్రమంలో కుర్రు ఉప్పలయ్య, కంకటి రాజయ్య, బాల్నె కార్తీక్, వడ్లకొండ వెంకటేశ్, సంఘం అధ్యక్షుడు పచ్చిమడ్ల సిద్దిరాములు, మండల అధక్షుడు అనగోని నర్సింహులు, కార్యదర్శి ఆకుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాసులాబాద్ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు


రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన సాయికృష్ణమూర్తి

మిరుదొడ్డి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ తెలిపారు. శనివారం పాఠశాలలో ఆయన మాట్లాడారు. ఎస్సీఈఆర్టీ ప్రచురించిన ట్రయల్ బ్లేజర్స్ అనే పుస్తకంలో బెస్ట్ ప్రాక్టీసెస్ కింద పాఠశాల ఉపాధ్యాయుడు సాయి కృష్ణమూర్తి అమలు చేస్తున్న వినూత్న బోధనలు ప్రచురితం అయ్యాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సాయి కృష్ణమూర్తిని ఉపాధ్యాయులు సన్మానించారు.

సుధాకర్‌రెడ్డి మృతి రాష్ట్ర ప్రజలకు తీరని లోటు

చేర్యాల/హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి రాష్ట్ర ప్రజలకు తీరని లోటు అని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు చేర్యాల సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ నుంచి అంచెలంచెలుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారని తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఒక నిజాయితీ గల నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. శనివారం చేర్యాల స్థానిక అంగడిబజారు చౌరస్తా వద్ద సురవరం ఫ్లెక్సీకి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సినిమా చూసొస్తాం



పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు స్థానిక సినిమా థియేటర్‌లో 'గోల్ చల్ చలో' పిల్లల సినిమా చూడడానికి ఇలా ఉత్సాహంగా వెళ్లారు. -జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)

రైతులకు మంచి ధర కల్పించండి


మార్కెట్‌లో ఐదు రూపాయల భోజనాన్ని పరిశీలించిన ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్

ములుగు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన కూరగాయలకు మంచి ధర కల్పించే విధంగా చూడాలని అధికారులకు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, వైస్ చెర్మన్ ప్రభాకర్‌గుప్తా కోరారు. ప్రభుత్వం రైతులకు మేలు చేసే విధంగా పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి యూరియా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అనంతరం ఐదు రూపాయలకు భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు. ఆకలితో వచ్చిన రైతులకు ఐదు రూపాయల భోజనం ఎంతో దోహద పడుతుందన్నారు. వారి వెంట నాయకులు మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జగదీష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం మంజూరుతో గ్రామస్థుల హర్షం

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసినందుకు తమ గ్రామ ప్రజలంతా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రుణపడి ఉంటామని బచ్చాయిపల్లి గ్రామస్థులు అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం బచ్చాయిపల్లి గ్రామంలో మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిందన్నారు. తమ గ్రామాన్ని ఎన్నో రకాలుగా అభివృద్ధిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దుర్గం ఎల్లం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దారిమళ్లిందా..!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. అందుకే యూరియాకు బదులుగా నానో యూరియా వినియోగించాలని అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

రైతుల పడిగాపులు

గడిచిన నెలరోజులుగా యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతూనే ఉన్నారు. జూన్, జూలై నెలల్లో కేటాయించిన యూరియా నిల్వలు తక్కువగా ఉండడంతో సమస్యలు ఉత్పన్నమవుతాయని 'ఆంధ్రజ్యోతి'లో ముందస్తుగా కథనం ప్రచురితమైంది. వర్షాలు కురిస్తే ఇబ్బందులు తప్పవనే కోణంలో అధికారులకు సూచనలు చేయడం జరిగింది. ఈ విషయంపై అప్రమత్తం కాకపోవడంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తాయి. చేతులు కాలాకా ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు అప్రమత్తమైనా ఫలితం లేకుండా పోతోంది. యూరియా నిల్వలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాకు రావాల్సిన కోటాను ఇక్కడే వినియోగిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాబోవని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద యూరియా టోకెన్ల కోసం గుమిగూడిన రైతులు

పది వేల మట్టి గణపతుల పంపిణీ

● హాజరుకానున్న హరీశ్ రావు

సిదిపేట కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడడంలో తమ వంతుగా సిద్దిపేటలో 10వేల మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామని అమర్నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు కాచం కాశీనాథ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని దాసంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు మాట్లాడారు. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా సిద్దిపేట పట్టణంలో ఆదివారం రోజున 10 వేల మట్టి వినాయక విగ్రహాలను సిద్దిపేట వెంకటేశ్వర ఆలయం ఎదుట ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హజరవుతున్నట్లు తెలిపారు. మట్టితో ప్రకృతి సిద్ధంగా తయారుచేసిన విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వాళ్లమవుతామన్నారు. సిద్దిపేట ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సోలార్ లైట్ ఏర్పాటుపై హర్షం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):పొన్నాల మధిర భట్టి రామన్నపల్లి గ్రామంలో ఎంపీ రఘునందన్‌రావు తన నిధులతో సుమారు రూ.1,20,000 విలువచేసే సోలార్ లైటును గ్రామంలో ఏర్పాటు చేయడం పట్ల గ్రామ బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి సోలార్ లైట్ వద్ద పూజా కార్యక్రమాన్ని నిర్వహించి రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ బీజేపీ నాయకులు కరుణాకర్, నరేష్, పాండరి,రాజశేఖర్, కుమార్, గోపి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

● 5 మొబైల్ ఫోన్లు, 4 మోటార్ సైకిళ్లు స్వాధీనం

దుబ్బాక,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): అక్బరోపేట- భూంపల్లి మండలం నగరం గ్రామ శివారులో పేకాట స్థావరం సిద్దిపేట టాస్క్‌పోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. అక్కడున్న ఏడుగురిలో ఇద్దరు పారిపోయారు. మిగితా ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.29,375/8ల నగదు, 5 మొబైల్ ఫోన్లు, 4 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

చేర్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీప్రసాద్, కృష్ణ సింధూర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం చేర్యాల పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు జరిపి పలు సూచనలు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిన్నకోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :చిన్నకోడూరు గ్రామ విశ్వకర్మ మనుమయ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడోజు దుర్గాచారి, ఉపాధ్యక్షుడిగా వేములవాడ చందు, క్యాషియర్ గా గోపాలపురం విజయ్, ప్రధాన కార్యదర్శిగా రాళ్లబండి నరేష్, కోశాధికారిగా రాళ్లబండి తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా గోపాలపురం శ్రీనివాస్, సలహాదారులుగా రాజు, రాములు, శంకరయ్య, భాస్కర్ తదితరులు ఎన్నికయ్యారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

చిన్నకోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. శనివారం వారు చిన్నకోడూరు తహసీల్దార్ సలీం మియాకు వినతి ప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు నందకుమార్, దేవదాస్, భాస్కర్, వెంకటేశ్వర్లు, మనోజ, అరుణ, వసంత తదితరులు పాల్గొన్నారు.జీవితాంతం రుణపడి ఉంటాం.

రైతులకు అందుబాటులో వ్యవసాయ పనిముట్లు

రాయపోల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. స్మామ్(సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిజం)లో భాగంగా మహిళా రైతులు, చిన్నరైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపై 5 రోటావేటర్లు, 5 పవర్ నాక్ స్పైవాన్ స్ప్రేయర్లు, ఒక పవర్ వీడర్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఆయా ఏఈఓల వద్ద దరఖాస్తు ఫారంతో పాటు పట్టేదారు పాస్‌బుక్, ఆధార్‌జిరాక్స్, ట్రాక్టర్ ఆర్సీతో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఆస్పత్రులపై దౌర్జన్యాలు సరికాదు


సీపీకి వినతి పత్రం అందజేస్తున్న డాక్టరు

సిద్దిపేట క్రైం ఆగస్ట్ 23 (ఆంధ్రజ్యోతి):సీరియస్‌గా ఉన్న పేషెంట్లకు ట్రీట్మెంట్ ఇస్తుండగా ప్రాణహాని జరిగినపుడు రోగికి సంబంధము లేని వారు వచ్చి అన్యాయంగా హాస్పిటల్స్‌పై చేస్తున్న దౌర్జన్యాలు చేస్తూ డబ్బులు అడుగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీకి పలువురు వైద్యులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ..

నిజంగా ఏదైనా నిర్లక్ష్యం జరిగితే న్యాయ పరంగా చర్యలు తీసుకోవాలని, కానీ దౌర్జన్యాలు చేయటము సరికాదన్నారు.అలా చేసిన వారిపై సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే చికిత్స ఇక్కడ లభిస్తున్నా కొందరి ఆగడాలతో చికిత్స చేయడానికి భయపడి హైదరాబాద్ పంపే పరిస్థితి వస్తుందని తెలిపారు .

సరిపడా యూరియా అందించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు డిమాండ్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం స్పందించి రైతాంగానికి యూరియా సరిపడా అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కారాములు అన్నారు. శనివారం సిద్దిపేటలో సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపు లేకపోవడం మూలంగా ఈ పరిస్థితి నెలకొందని అన్నారు. రైతాంగానికి సరిపడా యూరియా అందించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని అన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి రాష్ట్రంలో ఎనిమిది మంది, కాంగ్రెస్‌కు 8 మంది ఎంపీలు ఉన్నారని కేంద్రంపై ఒత్తిడి పెంచి రాష్ట్రంలో యూరియా కొరత తీర్చేలా కృషి చేయాలని అన్నారు.

బీజేపీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతతత్వ పోరాటంగా చిత్రీకరించి పోరాట స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అన్నారు. త్వరలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు.

తిమ్మాపూర్‌లో డెంగ్యూ కలకలం

(5వ పేజీ తరువాయి)

ఇద్దరికీ డెంగ్యూ నిర్ధారణ కాగా, చికిత్సపొందగా ప్రస్తుతం కోలుకున్నారు. అయితే, పది రోజుల నుంచి గ్రామంలో సుమారు 50 మందికిపైగా విష జ్వరాలతో మంచంపట్టారు. చిన్నాపెద్ద వైద్య చికిత్స కోసం గజ్వేల్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్తూ ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

పారిశుధ్య చర్యలు..

గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో ఇళ్ల పక్కన మురుగు గుంతలతో పాటు చెత్తచెదారం నిండి ఉంది. ఇందులో దోమలు, ఈగలు వృద్ధి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది దోమల నివారణకు ఆయిల్‌బాల్స్, మందులు పిచికారీ చేసినప్పటికీ ఇంకా అక్కడికక్కడ మురుగునీటి గుంతలు ఉన్నాయి. ప్రధాన రోడ్ల గుండా వర్షం నీరు పోవడానికి డ్రైనేజ్ లేకపోవడమే ముఖ్య కారణమని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలని, ప్రధాన రోడ్ల గుండా మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.


తిమ్మాపూర్ జ్వరంతో బాధపడుతున్న యువకుడు

రక్త నమూనాలు సేకరించాం

తీగుల్ పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో విష జ్వరాలు వచ్చినట్లుగా తమ దృష్టికి వచ్చింది. వెంటనే వైద్య సిబ్బందిని పంపించి చికిత్స అందించాం. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించి టెస్టుల కోసం పంపించాం. టెస్టుల రిపోర్ట్ రాగానే అవసరమైన చర్యలు చేపడతాం.

\- డాక్టర్ రాజశేఖర్, తీగుల్ వైద్యాధికారి

గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

● సిద్దిపేట డీపీఓ దేవకీదేవి

జగదేవ్‌పూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే కార్యదర్శులపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో డెంగీ జ్వరంతో బాధపడుతూ వ్యక్తి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న సిద్దిపేట డీపీవో మండల అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో మురికి గుంతలు, రోడ్లపై నిలిచిన వర్షపు నీటి గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో దేవకీదేవి మాట్లాడుతూ.. గ్రామాలలో రహదారులపై వర్షపు నీరు నిల్వ లేకుండా మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇంటి చుట్టుపక్కల చెత్త లేకుండా, మురుగు కాల్వలలో దోమల నివారణకు స్ప్రే చేసే విధంగా చూడాలని కార్యదర్శి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్ ఉన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ


ప్రతాప్‌రెడ్డి, లక్ష్మణరాజును సన్మానిస్తున్న స్వాములు

కుకునూరుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నకిష్టాపూర్ లక్ష్మణ్‌రాజు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్తాబాద్ పట్టణానికి చెందిన గురుస్వామి రాజు బృందం అయ్యప్ప మాల ధరించి మంత్రాలయం రాఘవేంద్రస్వామి దేవాలయం నుంచి శబరిమలకు పాదయాత్ర చేస్తున్న సందర్భంగా వారికి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎఫ్‌సీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ప్రసాద వితరణ ఏర్పాటు చేసిన లక్ష్మణ్ రాజును వారు సన్మానించారు. కార్యక్రమంలో ముస్తాబాద్ మాజీ ఎంపీపీ శరత్‌రావు, దేవి రవీందర్ , కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ లక్ష్మణ్‌రాజు, అమరేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మంద పవన్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నాలుగోసారి సిద్దిపేటకు చెందిన మంద పవన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలలో నాలుగోసారి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. పార్టీ తనపై నమ్మకాన్ని ఉంచి మరోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆకాశం కల్పించినందుకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆహా.. ఏమి రాజసం


నల్లని గేదెపై ఎక్కి సేదతీరుతున్న కుక్క

జాతివైరం లేని జీవులే జాతిజనులకు సందేశమవుతాయి. దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ వార్డు కర్నాల చెలక వద్ద శనివారం ఓ గేదెపై ఎక్కి సేదతీరుతున్న తెల్లని శునకం రాజసాన్ని చూసి ఇలా 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మనిపించింది.

\- దుబ్బాక, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి)

అవినీతిని వెలికి తీసేందుకు తనిఖీ

సిద్దిపేట రూరల్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):మహత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హమీ పథకంలో అవినీతి జరగకుండా, జరిగిన పనుల్లో అవినీతి వెలికి తీసెందుకే సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందని ఏపీడీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శనివారం సిద్దిపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హమీ నాలుగో విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. ఏపీడీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఏప్రిల్ 2024 చేపట్టిన 719 పనులకు పేమెంట్ రూ.2,93,44,610 చెల్లించగా మెటిరియల్ కింద రూ.24,67,695 చెల్లించారని తెలిపారు. అదేవిధంగా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో 27 పనులకు రూ.2,28,01,498 లో లెబర్ పేమెంట్ రూ.7,800లు, మెటిరియల్ కింద రూ.2,27,93,698 చెల్లించడం జరిగిందని చెప్పారు.